e
ESHAGNA
ఛానల్‌కి సంబంధించిన Pvt Ltd ( Broadcasting ),
MSME , Trademark , Food License (Fssai) ,
ISI License , RNI , Trust (12A-80G),
రిజిస్ట్రేషన్ చేయబడును
RTMP సర్వర్ KEY, E పేపర్ వెబ్సైట్,
న్యూస్ వెబ్సైట్ చేయబడును.

గాయత్రి
# వార్తలు
జాతీయ తెలుగు దిన పత్రిక
Registered No : APTEL/25/A1201



విలేకరులు కావలెను
గాయత్రి వార్తలు జాతీయ తెలుగు దినపత్రికలో ఆంధ్ర ప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాలలోని అన్ని నియోజకవర్గ, మండల కేంద్రాలలో పనిచేయుటకు ఆసక్తి గల విలేకరులు కావలెను. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
యం. నాగేశ్వర రావు
ఎడిటర్ గాయత్రి వార్తలు
సెల్: 73860 45673

PUBLISHED FROM : DELHI - MAHARASHTRA - ANDHRA PRADESH - TELANGANA - KARNATAKA - TAMILANADU - GOA - LOCKNOW - EDITOR : M. NAGESWARARAO

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్ శనివారం 27-9-2025 సంపుటి : 1 సంచిక :104 ఎడిటర్ : యం నాగేశ్వరరావు పేజీలు : 4 వెల రు : 2/-

## భారత్‌ను ఆ రెండు దేశాలతో కలిపి చూడకూడదు



ఢిల్లీ సూపర్ పవర్‌గా ఎదుగుతోందన్న అలగ్జాండర్

ఐరోపా సమాఖ్యతో, అమెరికాతో భారత్‌కు మంచి సంబంధాలు ఉన్నాయని వ్యాఖ్య

భారత్ ఎదుగుతున్న మహాశక్తి అన్న ఫిన్లాండ్ అధ్యక్షుడు

భారతదేశాన్ని రష్యా, చైనా దేశాలతో కలిపి చూడరాదని ఫిన్లాండ్ అధ్యక్షుడు అలగ్జాండర్ స్టబ్ అభిప్రాయపడ్డారు. న్యూఢిల్లీ ఒక సూపర్ పవర్‌గా మిగతా 2లో

## ఎవరు బతకాలో ఆయుధాలే నిర్ణయిస్తున్నాయ్.. జెలెన్‌స్కీ

ఎవరు బతకాలో ఆయుధాలే నిర్ణయిస్తున్నాయని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ వ్యాఖ్యలు చేశారు

ప్రస్తుతం ప్రపంచంలో మానవ చరిత్రలోనే అత్యంత విధ్వంసకరమైన ఆయుధ పోటీ నెలకొందన్నారు.




ఎవరు బతకాలో ఆయుధాలే నిర్ణయిస్తున్నాయని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ వ్యాఖ్యలు చేశారు.ప్రస్తుతం ప్రపంచంలో మానవ చరిత్రలోనే అత్యంత విధ్వంసకరమైన ఆయుధ పోటీ నెలకొందన్నారు. మిగతా 2లో

## ఉద్యోగుల పట్ల గత వైకాపా ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరించింది



- రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పట్ల గత వైకాపా ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరించిందని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ విమర్శించారు.
- పీఆర్సీ పునర్నిర్మాణం, బకాయిల చెల్లింపు అంశాలపై శాసన మండలిలో ప్రశ్నోత్తరాలు నిర్వహించారు.
- ఉద్యోగులు దాచుకున్న జీపీఎఫ్ సొమ్మును సైతం వైకాపా ప్రభుత్వం ఇతర అవసరాలకు వాడేసిందని ఆరోపించారు.

అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పట్ల గత వైకాపా ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరించిందని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ విమర్శించారు. పీఆర్సీ పునర్నిర్మాణం, బకాయిల మిగతా 2లో

ఆంధ్రప్రదేశ్ లో శాంతిభద్రతలు, సోషల్ మీడియా అంశాలపై శాసనసభలో సీఎం చంద్రబాబు నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు.

సామాజిక మాధ్యమాల్లో ఫేక్ ప్రచారాలు, ఇష్టానుసారంగా ప్రవర్తిస్తే కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గత పాలకుల హయాంలో పోలీసు వ్యవస్థ పూర్తిగా భ్రష్టు పట్టిందని.. కూటమి అధికారంలోకి వచ్చిన సమయం నుంచి ఒక్కో వ్యవస్థనూ సరిదిద్దుకుంటూ వస్తున్నామన్నారు.

నేరస్థులకు అండగా ఉండే రాజకీయ నేతలను తాను ఇంతవరకూ చూడలేదని.. రాజకీయ ముసుగులో ఉన్న నేరస్తులను బయటపెట్టాలని... వారి ముసుగు తీస్తే ప్రజలే అర్థం చేసుకుంటారని తెలిపారు.

వివేకా హత్య కేసు ఘటన జరిగినప్పుడు క్రైమ్ సీన్‌లో సీఐ శంకరయ్య ఉన్నారని.. వివేకా హత్య కేసులో ముఖ్యమంత్రిగా తననూ ఏమార్చారన్నారు.

## గత పాలకుల హయాంలో పోలీసు వ్యవస్థ పూర్తిగా
# భ్రష్టు పట్టింది

**ఎవరైనా ఆడబిడ్డల జోలికి వచ్చారో.. సీఎం డెడ్లీ వార్నింగ్**

**పిల్లలకు మనమివ్వగలిగే విలువైన ఆస్తి.. విద్య ఒక్కటే : సీఎం చంద్రబాబు**

**అమాయకంగా వచ్చి స్టేట్ మెంట్ ఇచ్చారు**

**రాజకీయపరంగా చాలా మందిని ఎదుర్కొన్నా**

శాంతిభద్రతల విషయంలో ఎలాంటి రాజీలేదని స్పష్టంగా చెబుతున్నామన్నారు. స్వర్ణాంధ్ర-2047 విజన్‌కు అనుగుణంగా ఏపీ ముందుకు వెళ్లాలని.. అగ్రస్థాయి రాష్ట్రంగా ఏపీ ఉండాలని ఆకాంక్షించారు. గత పాలకులు టీడీపీ కార్యాలయంపైనా దాడి చేశారని.. దీనిపై అప్పటి గవర్నర్, కేంద్ర హోంమంత్రికి ఫిర్యాదు చేశామని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు.



అమరావతి : ఆంధ్రప్రదేశ్ లో శాంతిభద్రతలు, సోషల్ మీడియా అంశాలపై శాసనసభలో సీఎం చంద్రబాబు నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. సామాజిక మాధ్యమాల్లో ఫేక్ ప్రచారాలు, ఇష్టానుసారంగా ప్రవర్తిస్తే కఠినంగా మిగతా 2లో

## 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ'
# అని ప్రజలకు అర్థమైంది

ఈ సర్కార్‌పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత: వైఎస్ జగన్

సూపర్ సిక్స్ హామీలపై చంద్రబాబును నిలదీస్తున్న వైఎస్ జగన్

సీఎం చంద్రబాబుపై నిప్పులు చెరిగిన వైఎస్ జగన్

అట్టర్ ఫ్లాప్ అయిన సూపర్ సిక్స్‌కు విజయోత్సవ సభ



ఈ పెద్దమనిషి ఎన్నికలప్పుడు ఏం చెప్పి వచ్చాడు.. వచ్చాక ఏం చేస్తున్నాడు? అప్పట్లో సంపద సృష్టిస్తానని పదే పదే ప్రతి మీటింగ్‌లో చెప్పారు. సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ మాత్రమే కాదు.. జగన్ చేసినవన్నీ కూడా చేస్తా.. ఇంకా ఎక్కువే ఇస్తానన్నాడు. ఈ రోజు పరిస్థితి చూస్తే.. సంపద సృష్టించడం అంటే.. కేవలం తనకు, తన మనుషులకే సంపద సృష్టించడం అని తేటతెల్లం అయింది. రాష్ట్రానికి సంపద సృష్టించడం దేవుడెరుగు.. స్కామ్‌లు చేస్తూ ఉన్న సంపద ఆవిరి చేస్తున్న పరిస్థితి. మన ప్రభుత్వంలో అమలు చేసిన స్కీములన్నింటినీ రద్దు చేశారు. సూపర్ సిక్స్, సూపర్ సెవెన్‌లు గాలికెగిరిపోయిన పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోంది.ప్రభుత్వం అనేది మంచి విద్యా వ్యవస్థను, ప్రతి పేదవాడికి అందు బాటులో మంచి వైద్య వ్యవస్థను ఏర్పాటు చేస్తుందని అనుకుంటాం. మిగతా 2లో

## విగ్గు, పెగ్గు కాదు... సిగ్గుండాలి!



- టీడీపీ ఎమ్మెల్యే బాలకృష్ణపై వైసీపీ అధికార ప్రతినిధి యాంకర్ శ్యామల ఆగ్రహం
- వైఎస్ జగన్‌ను "సైకో" అనడాన్ని తీవ్రంగా ఖండించిన శ్యామల
- గతంలో వైఎస్సార్ చేసిన సహాయాన్ని బాలయ్య మరిచిపోయారంటూ విమర్శ

## 'బాలకృష్ణకు బ్రీత్ ఎనలైజర్‌తో చెక్ చేయించాలి'

**మీ స్థాయి ఏంటో జనసేన వారే తేల్చి చెప్పారు.**

సినిమా ఫంక్షన్‌లకు వెళ్లినట్లు అసెంబ్లీకి కూడా అలానే వెళ్లారా? అని ఎమ్మెల్యే, నటుడు బాలకృష్ణను ప్రశ్నించారు వైఎస్సార్‌సీపీ మాజీ ఎంపీ మార్గాని భరత్.

అసెంబ్లీలో ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్న బాలకృష్ణ మానసిక స్థితిపై తమకు అనుమానం ఉందన్నారు భరత్.



సినిమా ఫంక్షన్‌లకు వెళ్లినట్లు అసెంబ్లీకి కూడా అలానే వెళ్లారా? అని ఎమ్మెల్యే, నటుడు మిగతా 2లో

## నా దృష్టికి తీసుకురండి

**గంజాపై పటిష్ట చర్యలు.. తగ్గేదేలే అన్న హోంమంత్రి**

ఆంధ్రప్రదేశ్ శాసనసభలో శాంతిభద్రతలపై స్వల్పకాలిక చర్చ జరిగింది.

గతంలో పోలీసులను అతిగా ఉపయోగించడం జరిగిందని.. దానికి నిదర్శనమే 151 నుంచి 11 సీట్లకు జగన్ మోహన్ రెడ్డి పడిపోయారని అన్నారు.



ఆంధ్రప్రదేశ్ శాసనసభలో శాంతిభద్రతలపై స్వల్పకాలిక చర్చ జరిగింది. ఈ సందర్భంగా హోంమంత్రి అనిత మాట్లాడుతూ.. గతంలో పోలీసులను అతిగా ఉపయోగించడం జరిగిందని.. దానికి నిదర్శనమే మిగతా 2లో

## అన్ని పథకాల్లో కాంగ్రెస్ స్కాములు చేస్తోంది



- రాష్ట్రంలో అమలవుతోన్న సంక్షేమ పథకాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున స్కాములకు పాల్పడుతున్నారని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ సంచలన ఆరోపణలు చేశారు.
- తప్పుడు హామీలతో కాంగ్రెస్ రాష్ట్రంలో దొడ్డిదారిన అధికారంలో వచ్చిందని ఫైర్ అయ్యారు. మిగతా 2లో

అద్భుతమైన అభివృద్ధి చూపెట్టిండి

ఎవ్వరినీ వదిలిపెట్టం.. నల్గొండలో లంబాడా రైతు మీద దాష్టీకంపై కేటీఆర్ ఆగ్రహం

గిగ్ వర్కర్స్‌కు కాంగ్రెస్ పార్టీ తీరని ద్రోహం చేసిందని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు.

అభయ హస్తం డిక్లరేషన్‌లో గిగ్, ప్లాట్‌ఫాం కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల ప్రచారంలో గిగ్ వర్కర్స్ కోసం ప్రత్యేక డిక్లరేషన్ విడుదల చేసిన కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి వచ్చాక వారిని పట్టించుకోవడం లేదని మండిపడ్డారు.

తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్స్ యూనియన్ సభ్యులు తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను కలిశారు.

తాము ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయడం లేదని అన్నారు.

గిగ్ వర్కర్స్‌కు అండగా ఉంటామన్న కేటీఆర్... వారి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాన్ని నిలదీస్తామని చెప్పారు.

## గిగ్ వర్కర్స్‌కు కాంగ్రెస్ పార్టీ తీరని
# ద్రోహం చేసింది

**అవసరమైతే మానవ హక్కుల కమిషన్‌కు వెళ్తాం**

**కాంగ్రెస్, బీజేపీ నుంచి తెలంగాణను కాపాడుకోవాలి.**



గంగుల కమలాకర్, వినోద్ కుమార్ కష్టపడి కరీంనగర్‌కు స్మార్ట్ సిటీ తెస్తే కాంగ్రెస్ దాన్ని ఆగం చేస్తోందని కేటీఆర్ మండిపడ్డారు. డాక్టర్ గౌతమి రెడ్డి స్ఫూర్తితో విద్యావంతులు, యువత రాజకీయాల్లోకి వచ్చి తెలంగాణను కాంగ్రెస్, బీజేపీల నుంచి కాపాడుకోవాలని కోరారు. స్వీయ రాజకీయ అస్తిత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష అన్న జయశంకర్ సార్ మాటలను నిజం చేయాలని సూచించారు.

హైదరాబాద్: గిగ్ వర్కర్స్‌కు కాంగ్రెస్ పార్టీ తీరని ద్రోహం చేసిందని భారత రాష్ట్ర సమితి కార్య నిర్వాహక మిగతా 2లో

## బిల్లుల పేరుతో బీసీలను అవమానిస్తే ఊరుకునేది లేదు



- బీసీ రిజర్వేషన్ల బిల్లు గురించి ఢిల్లీ పెద్దలను సీఎం రేవంత్‌రెడ్డి ఏనాడూ అడగలేదని భారత రాష్ట్ర సమితి నేత, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు.
- హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

హైదరాబాద్: బీసీ రిజర్వేషన్ల బిల్లు గురించి ఢిల్లీ పెద్దలను సీఎం రేవంత్‌రెడ్డి ఏనాడూ అడగలేదని మిగతా 2లో

## భారత్‌ను ఆ రెండు దేశాలతో కలిపి చూడకూడదు

ఎదుగుతోందని, ఈ దేశంతో కలిసి పనిచేయాలని ఆయన సూచించారు. బ్లూమ్‌బర్గ్ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో భాగంగా, భారత్, రష్యా, చైనా మధ్య స్నేహం పెరగుతున్నదనే ప్రశ్నకు ఆయన ఈ విధంగా సమాధాన మిచ్చారు.ఐరోపా సమాఖ్యకు భారత్ అత్యంత సన్నిహిత దేశమని ఆయన పేర్కొన్నారు. అమెరికాతో కూడా భారత్‌కు సత్సంబంధాలు ఉన్నాయని గుర్తు చేశారు. అందువల్లనే ఆ దేశాన్ని చైనా, రష్యాతో కలిపి చూడకూడదని పశ్చిమ దేశాలకు ఆయన సూచించారు. భారతదేశం ఎదుగుతున్న మహాశక్తి అని, జనాభా, ఆర్థిక వ్యవస్థ రెండూ కలిసి రావటం సానుకూల అంశమని వ్యాఖ్యానించారు. పశ్చిమ దేశాలు భారత్‌తో సఖ్యతగా ఉంటూ, కలిసి పనిచేయడానికి ప్రయత్నించాలని ఆయన అన్నారు.అదే సమయంలో చైనా, రష్యా దేశాలకు ప్రత్యక్ష సంబంధాలు ఉన్నాయని అలగ్జాండర్ పేర్కొన్నారు. 1990 వరకు రెండు దేశాల ఆర్థిక వ్యవస్థలు సమానంగా ఉండగా, ప్రస్తుతం చైనా పది రెట్లు పెద్దదని తెలిపారు. గ్యాస్, చమురు, సాంకేతిక పరిజ్ఞానం వంటి వాటి మార్పిడితో రష్యాను యుద్ధాలు చేసేంతగా చైనా బలపరిచిందని ఆయన అభిప్రాయపడ్డారు. ఆ రెండు దేశాల మధ్య బలమైన సంబంధాలు ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. గతంలో కూడా అలగ్జాండర్ భారత్‌కు మద్దతుగా ప్రకటనలు చేశారు.

## ఎవరు బతకాలో ఆయుధాలే నిర్ణయిస్తున్నాయ్.. జెలెన్‌స్కీ

న్యూయార్క్‌లోని ఐక్యరాజ్య సమితి సర్వ ప్రతినిధి సభలో మాట్లాడిన ఆయన.. రష్యాకు వ్యతిరేకంగా చర్యలు చేపట్టాలని అంతర్జాతీయ సమాజాన్ని కోరారు.ఐరాస సహా ఇతర బలహీన అంతర్జాతీయ సంస్థలు ఉక్రెయిన్, గాజా, సుడాన్‌లో యుద్ధాలను నిలువరించలేకపోయాయని ఎండ గట్టారు. "ఎవరు ప్రాణాలతో ఉండాలో ఆయుధాలే నిర్ణయిస్తున్నాయి. ఈ ప్రపంచంలో స్నేహితులు లేకపోతే ఆయుధాలు మాత్రమే ఉంటాయి. ఎలాంటి భద్రతా హామీలు ఉండవు. మాపై యుద్ధాన్ని రష్యా పొడిగిస్తూనే ఉంది. దానిని అంతర్జాతీయ సమాజం ఖండించాలి. పుతిన్‌ను ఇప్పుడు ఆపకపోతే.. ఈ యుద్ధం మరింత విస్తరిస్తుంది. రష్యా డ్రోన్లు యూరప్ అంతటా ఎగురుతున్నాయి" అని జెలెన్‌స్కీ హెచ్చరించారు. 2022 ఫిబ్రవరిలో ఉక్రెయిన్‌పై రష్యా సైనిక చర్య ప్రారంభించింది . గత మూడేళ్లకు పైగా ఈ యుద్ధం కొనసాగుతూనే ఉంది. దానిని ఆపేందుకు జరుగుతోన్న ప్రయత్నాలు ఆశించిన ఫలితాలు ఇవ్వడం లేదు. ఏకంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రంగంలోకి దిగినా కూడా యుద్ధాన్ని ఆపలేకపోతున్నారు.ఇదిలాఉంటే.. భారత్ తరఫున విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ ఐరాస సభలో మాట్లాడారు. " పెరుగుతున్న అనిశ్చితులు, ప్రపంచ పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్న సమయంలో మనం సమావేశం అయ్యాం. ముఖ్యంగా గ్లోబల్ సౌత్ దేశాలు పలు సవాళ్లు ఎదుర్కొంటున్నాయి. మహమ్మారి నుంచి తేరుకోకముందే ఉక్రెయిన్, గాజా యుద్ధాలు మొదలు ప్రతికూల వాతావరణ సంఘటనలు, అస్థిర వాణిజ్యం.. పెట్టుబడుల ప్రవాహం, వడ్డీ రేట్లలో అనిశ్చితితోపాటు సుస్థిరాభివృద్ధి లక్ష్యాల అజెండాలో గణనీయ క్షీణత కనిపించడం వంటి సమస్యలు ఎదుర్కొంటున్నాం" అని జైశంకర్ పేర్కొన్న సంగతి తెలిసిందే.

## ఉద్యోగుల పట్ల గత వైకాపా ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరించింది

చెల్లింపు అంశాలపై శాసన మండలిలో ప్రశ్నోత్తరాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీలు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. ఉద్యోగులు దాచుకున్న జీపీఎఫ్ సొమ్మును సైతం వైకాపా ప్రభుత్వం ఇతర అవసరాలకు వాడేసిందని ఆరోపించారు. ఇప్పుడు ఆ పార్టీ నేతలు ఉద్యోగుల విషయంలో దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు."ఉద్యోగులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా గత వైకాపా ప్రభుత్వం మోసం చేసింది. ఎన్నికల వాగ్దానాలను గుర్తుపెట్టుకుని అమలు చేసి ఉంటే ఆ పార్టీకి ఈ దుస్థితి వచ్చేది కాదు. గత సర్కారు హయాంలో 94 కేంద్ర ప్రభుత్వ పథకాల సొమ్మును ఇతరాలకు వాడేశారు. గత వైకాపా ప్రభుత్వం ఉద్యోగులకు రివర్స్ పీఆర్సీ ఇచ్చింది. ఐఆర్ కంటే తక్కువగా 23 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చి అన్యాయం చేసింది. కరోనా పేరు చెబుతూ ఉద్యోగుల ఫిట్‌మెంట్‌ను తగ్గించింది. ఇదే వంకతో చెప్పి కేంద్రం నుంచి రావాల్సిన దానికంటే ఎక్కువ నిధులు తీసుకుంది. రెండేళ్లుగా రావాల్సిన రెవెన్యూ లోటు మొత్తాన్ని ముందే తీసుకున్నారు.ఉద్యోగుల సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం కూటమి ప్రభుత్వం అన్ని విధాలా చర్యలు తీసుకుంది. గతంలో తెలంగాణ కంటే ఒకశాతం ఎక్కువ అంటే.. 43 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చిన ప్రభుత్వం మాదే. ఉద్యోగులకు గత ప్రభుత్వం పెట్టిన బకాయిల చెల్లింపునకు దశలవారీగా చర్యలు తీసుకుంటున్నాం. 2024-25 మధ్యలో ఉద్యోగులకు సంబంధించి రూ.11,496 కోట్ల బకాయిలను ప్రభుత్వం చెల్లించింది. 2025-26లో రూ.3,549 కోట్లను చెల్లించాం. ఉద్యోగుల సమస్యల పరిష్కారం విషయంలో, వేతనాల పెంపు కోసం పీఆర్సీ కమిషన్ నియామకంపై కూటమి ప్రభుత్వం సానుకూలంగా ఉంది. సరైన సమయంలో సీఎం చంద్రబాబు దీనిపై చర్యలు తీసుకుంటారు" అని పయ్యావుల కేశవ్ తెలిపారు.

## విగ్గు, పెగ్గు కాదు... సిగ్గుండాలి!

టీడీపీ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణపై వైసీపీ అధికార ప్రతినిధి యాంకర్ శ్యామల తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను ఉద్దేశించి "సైకో గాడు" అంటూ బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలను ఆమె తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. రాజకీయ విమర్శలు హుందాగా ఉండాలని, వ్యక్తిగత దూషణలకు దిగడం సరికాదని హితవు పలికారు.గతంలో బాలకృష్ణకు వైఎస్ కుటుంబం అండగా నిలిచిందని శ్యామల వెల్లడించారు. "మీ ఇంట్లో కాల్పుల ఘటన జరిగినప్పుడు, మిమ్మల్ని ఆ కేసు నుంచి కాపాడింది అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి గారు కాదా? ఆ విషయాన్ని ఇంత త్వరగా ఎలా మర్చిపోయారు?" అని ఆమె ప్రశ్నించారు. ఆపద సమయంలో ఆదుకున్న వారిని విమర్శించడం తగదని ఆమె అన్నారు.అంతేకాకుండా, వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు బాలకృష్ణ ఛైర్మన్‌గా ఉన్న బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రికి సహాయం చేశారని తెలిపారు. "గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న కోట్ల రూపాయల ఆరోగ్యశ్రీ బకాయిలను జగన్ గారి ప్రభుత్వమే విడుదల చేసింది. ఆ విషయం మీకు గుర్తులేదా?" అని ఆమె నిలదీశారు.ఈ సందర్భంగా బాలకృష్ణపై శ్యామల కొన్ని ఘాటైన వ్యక్తిగత వ్యాఖ్యలు చేశారు. 'నెత్తిన విగ్గు, చేతిలో పెగ్గు ఉంటే సరిపోదు, ఒంటికి కొంచెం సిగ్గు కూడా ఉండాలి" అంటూ ఆమె తీవ్రంగా విమర్శించారు. రాజకీయాల్లో ఉన్నవారు మాట్లాడేటప్పుడు సంయమనం పాటించాలని, లేకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని శ్యామల పేర్కొన్నారు.

## అన్ని పథకాల్లో కాంగ్రెస్ స్కాములు చేస్తోంది

రాష్ట్రంలో అమలవుతోన్న సంక్షేమ పథకాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున స్కాములకు పాల్పడుతున్నారని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ సంచలన ఆరోపణలు చేశారు.ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తప్పుడు హామీలతో కాంగ్రెస్ రాష్ట్రంలో దొడ్డిదారిన అధికారంలో వచ్చిందని ఫైర్ అయ్యారు. ప్రజలను మోసం చేస్తున్న రేవంత్ సర్కా కుట్రలను ప్రజలకు గమనిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో భీకర వర్షాలకు పంటలు నష్టపోయిన రైతన్నలు, వరద బాధితులను ఇప్పటి వరకు ఆదుకోకపోవడం దారుణమని కామెంట్ చేశారు.ఇక పొరుగు రాష్ట్రంలో కర్ణాటక ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంచేందుకు భూ సేకరణకు ఆదేశాలు జారీ చేసి నిధులు విడుదల చేసినా.. తెలంగాణ ప్రభుత్వ పెద్దల్లో ఏమాత్రం చలనం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కర్ణాటక ప్రభుత్వ అవినీతిలో తెలంగాణ కాంగ్రెస్ నేతలు వాటాలు పొంది.. ఆల్మట్టి డ్యామ్ ఎత్తు విషయంలో మౌనం వహిస్తున్నారని ధర్మపురి అర్వింద్ ఆరోపించారు.

## బిల్లుల పేరుతో బీసీలను అవమానిస్తే ఊరుకునేది లేదు

భారత రాష్ట్ర సమితి నేత, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు.హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ నేతలు మొదట చట్ట సవరణ అన్నారని.. తర్వాత ఆర్డినెన్స్.. ఇప్పుడు జీవో అంటున్నారన్నారు. బిల్లుల పేరుతో బీసీలను అవమానిస్తే ఊరుకునేది లేదని చెప్పారు. 42 శాతం రిజర్వేషన్లను చట్టబద్ధంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీలు అడగకపోయినా.. కాంగ్రెస్ పార్టీయే హామీ ఇచ్చిందని పేర్కొన్నారు. రిజర్వేషన్ల అమలుపై ఆ పార్టీ మోసం చేస్తోందని దుయ్యబట్టారు."ఈ అంశం విద్య, ఉద్యోగాల్లో లక్షల మంది జీవితాలతో ముడిపడి ఉంది. జీవో ఇచ్చి కేవలం రాజకీయ పదవులకే సరిపెడితే ఊరుకునేది లేదు. రాజకీయ పదవుల్లోనూ బీసీలకు పూర్తి న్యాయం చేయలేదు. బిల్లు ఆమోదం కోసం దిల్లీలో ధర్నాలు చేశారు. కానీ.. ఎవరినీ అడగలేదు. విజయోత్సవ సభ పెడుతున్నామని ఎందుకు వెనక్కి తగ్గారు?" అని శ్రీనివాస్ గౌడ్ ప్రశ్నించారు.

## నా మిత్రుడి ప్రాణం బలిగొన్నారు

వాట్సాప్‌లో వచ్చిన సందేశాన్ని ఫార్వార్డ్ చేసినందుకు వైకాపా ప్రభుత్వం తన మిత్రుడైన నలంద కిశోర్ ప్రాణాన్ని బలి తీసుకుందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు.అమరావతి శాసనసభలో వైకాపా వేధింపులపై జరిగిన చర్చలో గంటా ఈ వ్యాఖ్యలు చేశారు.కొవిడ్ సమయంలో అమెరికా నుంచి ఫార్వార్డ్ అయిన వాట్సాప్ మెసేజ్‌ను తన మిత్రుడు (తెదేపా సానుభూతి పరుడు) ఇతర స్నేహితుల చరవాణులకు పంపించారన్నారు. సంబంధిత సందేశం అప్పటి వైకాపా ఉత్తరాంధ్ర ఇన్‌ఛార్జిని కొంత అవమానపరిచేలా ఉందని వెంటనే సీఐడీ కేసు నమోదు చేసి తన మిత్రుడిని అదుపులోకి తీసుకున్నారన్నారు. ఆ సమయంలో కొవిడ్ ప్రభావం తీవ్రంగా ఉన్నా ఏ మాత్రం పట్టించుకోలేదన్నారు. ముందుగా విశాఖలో అరెస్టు చేసి కేసును విజయనగరంలో విచారించే అవకాశమున్నా కావాలని ఇరుకైన కారులో కొవిడ్ నిబంధనలు అతిక్రమించి కర్నూలుకు తరలించారన్నారు. దీంతో ఆయన కొవిడ్ బారినపడి చనిపోయారని గుర్తు చేశారు.

## గత పాలకుల హయాంలో పోలీసు వ్యవస్థ పూర్తిగా భ్రష్టు పట్టింది

చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గత పాలకుల హయాంలో పోలీసు వ్యవస్థ పూర్తిగా భ్రష్టు పట్టిందని.. కూటమి అధికారంలోకి వచ్చిన సమయం నుంచి ఒక్కో వ్యవస్థనూ సరిదిద్దుకుంటూ వస్తున్నామన్నారు. నేరస్థులకు అండగా ఉండే రాజకీయ నేతలను తాను ఇంతవరకూ చూడలేదని.. రాజకీయ ముసుగులో ఉన్న నేరస్తులను బయటపెట్టాలని... వారి ముసుగు తీస్తే ప్రజలే అర్థం చేసుకుంటారని తెలిపారు.

వాటి పట్ల కఠినంగానే...

వాహనాలకు సంబంధించి నిబంధనల ఉల్లంఘనలపై కఠినంగానే ఉంటామని తేల్చిచెప్పారు. ప్రస్తుతం టెక్నాలజీ పెరిగి ఫ్రాడ్స్, సైబర్ క్రైమ్స్ పెరుగుతున్నాయని.. నిద్ర లేచినప్పటి నుంచి నిద్రపోయే వరకూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కొన్ని బ్యాచ్‌లు పెద్దఎత్తున ఫేక్ న్యూస్ ప్రచారం చేస్తున్నాయని... అది ఫేక్ అని మనమే చెప్పుకునే పరిస్థితులు ఉన్నాయన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఒకలా.. ఇప్పుడు మరోలా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు.

ఇదే ప్రత్యక్ష ఉదాహరణ..

వివేకా హత్య కేసు ఘటన జరిగినప్పుడు క్రైమ్ సీన్‌లో సీఐ శంకరయ్య ఉన్నారని.. వివేకా హత్య కేసులో ముఖ్యమంత్రిగా తననూ ఏమార్చారన్నారు. గుండెపోటు కాదు గొడ్డలి పోటు అని తేలిందని... అక్కడున్న రక్తాన్ని శుభ్రం చేశారని తెలిపారు. ఏమీ తెలియని వారిలా అమాయకంగా వచ్చి స్టేట్ మెంట్ ఇచ్చారని.. ఫేక్ రాజకీయాలకు ఇది ప్రత్యక్ష ఉదాహరణ అని సీఎం చెప్పుకొచ్చారు. రాజకీయపరంగా చాలా మందిని ఎదుర్కొన్నానని, ఇప్పుడు నేరస్తుల్ని ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు.'శంకరయ్య ఒక సీఎంకు నోటీసులు పంపించటం అంటే ఎంత ధైర్యం చేసి ఉండాలి. నేరం జరిగినప్పుడు సీన్ ఆఫ్ అఫెన్సులో సీఐగా విధులు నిర్వహించి నేరం జరిగిన ప్రాంతాన్ని రక్షించాలి. క్రిమినల్స్‌తో కలిసిపోయి ముఖ్యమంత్రికే నోటీసు పంపించే స్థాయికి శంకరయ్య చేరుకున్నారు. పొగాకు రైతుల్ని పరామర్శించడానికి వెళ్లి సినిమా డైలాగులు చెప్తారా?' అంటూ ముఖ్యమంత్రి తీవ్రస్థాయిలో మండిపడ్డారు.'మహిళలపై రాష్ట్రంలో నేరాలు తగ్గాయి. గతంతో పోల్చుకుంటే 4.84 శాతం మేర మహిళలపై నేరాలు తగ్గాయి. వరకట్న మరణాలు 43 శాతం తగ్గాయి. మహిళా హత్యలు 15 శాతం తగ్గాయి. మహిళా ఆత్మహత్యలు 59 శాతం తగ్గాయి. మహిళలపై సైబర్ వేధింపులు 17 శాతం తగ్గాయి. వరకట్న వేధింపులు 25 శాతం తగ్గాయి. మహిళలపై నేరాలకు పాల్పడ్డ వారిలో 343 మందికి శిక్షలు పడ్డాయి. మహిళలను కించపరిచేలా పోస్టింగ్‌లు పెట్టి అవమానిస్తారా?. ఎవరైనా ఆడబిడ్డల జోలికి వస్తే అదే వారికి చివరి రోజు అవుతుందని హెచ్చరిస్తున్నాం. మహిళలపై నేరం జరిగితే కేవలం 8-10 నిముషాల్లోపే ఘటనా స్థలికి చేరుకునేలా చర్యలు చేపట్టాం. శక్తి టీమ్‌లను ఏర్పాటు చేసి మహిళల రక్షణ పట్ల చర్యలు చేపడుతున్నాం. సెక్సువల్ అఫెండర్లపైనా రౌడీషీట్లను ఓపెన్ చేస్తాం. ఆన్ లైన్‌లోనూ ఫొటోలు పెట్టి ఎక్స్ పోజ్ చేస్తాం' అని వార్నింగ్ ఇచ్చారు.సింగయ్యను కారు కింద తొక్కించేసి తిరిగి బురదజల్లే ప్రయత్నం చేశారని ఫైర్ అయ్యారు సీఎం చంద్రబాబు. కనీసం మానవత్వం లేకుండా పొదల్లోకి విసిరేసి వెళ్లిపోయారన్నారు. తిరిగి మృతుడి భార్యతో అసత్యాలు చెప్పించారని.. తన భర్త జగన్ కారు కింద చనిపోలేదని, పోలీసులు అంబులెన్సులో తీసుకెళ్లి చంపేశారని చెప్పించారన్నారు. మామిడి రైతులను పరామర్శించడానికి వెళ్లి రోడ్డుపై మామిడికాయలు ట్రాక్టర్లతో తొక్కించారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.శాంతిభద్రతల విషయంలో ఎలాంటి రాజీలేదని స్పష్టంగా చెబుతున్నామన్నారు. స్వర్ణాంధ్ర-2047 విజన్‌కు అనుగుణంగా ఏపీ ముందుకు వెళ్లాలని.. అగ్రస్థాయి రాష్ట్రంగా ఏపీ ఉండాలని ఆకాంక్షించారు. గత పాలకులు టీడీపీ కార్యాలయంపైనా దాడి చేశారని.. దీనిపై అప్పటి గవర్నర్, కేంద్ర హోంమంత్రికి ఫిర్యాదు చేశామని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు.

## గిగ్ వర్కర్స్‌కు కాంగ్రెస్ పార్టీ తీరని ద్రోహం చేసింది

అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. అభయ హస్తం డిక్లరేషన్‌లో గిగ్, ప్లాట్‌ఫాం కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఎన్నికల ప్రచారంలో గిగ్ వర్కర్స్ కోసం ప్రత్యేక డిక్లరేషన్ విడుదల చేసిన కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి వచ్చాక వారిని పట్టించుకోవడం లేదని మండిపడ్డారు.తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్స్ యూనియన్ సభ్యులు తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను కలిశారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయడం లేదని అన్నారు. గిగ్ వర్కర్స్‌కు అండగా ఉంటామన్న కేటీఆర్... వారి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాన్ని నిలదీస్తామని చెప్పారు. కాంగ్రెస్ హామీ ఇచ్చినట్లు గిగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు, బీమాతో కూడిన సామాజిక భద్రత, సరైన వేతనాలతో పాటు మరణించిన కార్మికులకు పరిహారం చెల్లింపు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ హామీల అమలు బాధ్యతను తీసుకుంటానన్న రాహుల్ గాంధీ, వీరి సమస్యలపై వెంటనే స్పందించాలన్నారు. కరోనా వంటి క్లిష్ట పరిస్థితుల్లోనూ ప్రజలకు సేవలు అందించిన గిగ్ వర్కర్లకు కాంగ్రెస్ ద్రోహం చేస్తోందని విమర్శించారు. గిగ్, ప్లాట్‌ఫాం కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక చట్టం తీసుకొస్తే భారత రాష్ట్ర సమితి పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని కేటీఆర్ తెలిపారు. నల్గొండ జిల్లాలో యూరియా కోసం ప్రశ్నించిన గిరిజన రైతుపై పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించిన ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. యూరియా కోసం ఆందోళన చేస్తే నడవరాకుండా కొట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనివెనుక ఉన్న ఎవరినీ వదిలిపెట్టమని.. అవసరమైతే మానవ హక్కుల కమిషన్‌కు వెళ్తామని తెలిపారు. అవసరమైతే ఎస్సీ, ఎస్టీ కమిషన్‌లో ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.కరీంనగర్ జిల్లాలో జరిగిన ఓ కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధికారం కోల్పోవడానికి రెండు కారణాలు ఉన్నాయని తెలిపారు. అందులో ఒకటి మనం చెప్పుకోలేదని అన్నారు. మనది మనం ప్రచారం చేసుకోలేదని చెప్పారు. ఈ ఓటమిలో మన లోపమే ఉందని.. నాయకుడి లోపం లేదని తెలిపారు. దేశ చరిత్రలో ఎవరూ పనిచేయనంత అద్భుతంగా మన నాయకుడు కేసీఆర్ పనిచేశారని పేర్కొన్నారు. ఇంటింటికీ నీళ్లు తెచ్చిండు.. సంక్షేమాన్ని చూపించిండు.. అద్భుతమైన అభివృద్ధి చూపెట్టిండని అన్నారు. అయినప్పటికీ 39 సీట్లకే ఎందుకు పరిమితమయ్యామనే దానిపై విశ్లేషించుకోవాలని సూచించారు. అంతర్మథనం చేసుకోకుండా.. అంతా బాగుందని జబ్బలు సరుచుకుని తిరగవద్దని చెప్పారు.ఎన్నికల్లో అప్పుడప్పుడు గెలుస్తుంటాం.. అప్పుడప్పుడు ఓడిపోతుంటామని కేటీఆర్ తెలిపారు. అయితే మనకంటే మెరుగైన పరిపాలన, సంక్షేమం అందించే వారి చేతిలో ఓడిపోతే బాధ అనిపించదని.. కానీ కాంగ్రెస్ పరిపాలన ఎలా ఉందని అడిగారు. కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ప్రజలు గోస పడుతున్నారని.. యూరియా కోసం మళ్లీ క్యూలైన్లలో నిలబడే దుస్థితి వచ్చిందని వాపోయారు. నల్గొండలో యూరియా కావాలని లంబాడా సోదరుడు ఆందోళనలో పాల్గొంటే.. ఆయన్ను గుంజుకొచ్చి పోలీస్ స్టేషన్లలో పెట్టి థర్డ్ డిగ్రీ ఇచ్చారని మండిపడ్డారు. ఉల్టా ఆయనపై కేసు పెట్టి.. ఇంటికెళ్లి భార్యను బండబూతులు తిట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇవాళ ఆయన నడవరాక కుంటుకుంటూ తిరిగే దుస్థితి వచ్చిందన్నారు. ఆ వీడియోలు సోషల్‌మీడియాలో చూసి.. ఆ పిల్లాడిని పలకరించి ధైర్యం చెప్పి రమ్మని జగదీశ్ రెడ్డికి చెప్పానని అన్నారు. దీనివెనుక ఉన్న ఎవరినీ వదిలిపెట్టవద్దని జగదీశ్ రెడ్డికి తెలిపానని అన్నారు. అవసరమైతే మానవ హక్కుల కమిషన్‌కు వెళ్దామని, ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు వెళ్తామని తెలిపారు.రాష్ట్రంలో ఇటువంటి పరిస్థితి ఎందుకు వచ్చిందని కేటీఆర్ ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో రైతులు సుభిక్షంగా ఉండేవారని, ఆటోవాళ్లకు చెప్తే.. వాళ్లే ఇంటి ముందు యూరియా బస్తా వేసి వెళ్లేవారని గుర్తుచేశారు. పాతరోజులు తీసుకొస్తానని రేవంత్ రెడ్డి నిజాయితీగా చెప్పిండు.. అన్నట్లే పాత రోజులు తీసుకొచ్చాడని ఎద్దేవా చేశారు. యూరియా కోసం చెప్పుల క్యూలైన్లు, తన్నుకునుడు, గుద్దుకునుడు, పోలీసులు కొట్టడం వంటివి మళ్లీ మొదలయ్యాయని అన్నారు. రైతులను పోలీసులు పొట్టు పొట్టు కొట్టుడేనా రాహుల్ గాంధీ చెప్పిన మొహబ్బత్‌కీ దుఖాన్ అని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ వరంగల్‌కు వచ్చినప్పుడు కిసాన్ డిక్లరేషన్ ప్రకటించారని గుర్తుచేశారు. కేసీఆర్ రైతుబంధు 10 వేలు ఇస్తే.. మేం 15 వేలు ఇస్తామని అన్నారు. కేసీఆర్ రెండు పంటలకు ఇస్తే మేం మూడు పంటలకు ఇస్తామని తెలిపారు. పంటకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పారు. ఎరువులు, విత్తనాలు ఇస్తామని, రెండు లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఇన్ని చెప్పి ఇప్పుడు రైతుల మీద పడి పోలీసులు కొడుతున్నారని అన్నారు. ఇది కాంగ్రెసోళ్ల నీతి అని మండిపడ్డారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నిలువునా మోసం చేస్తుంటే.. కేంద్రంలోని బీజేపీ సర్కార్ సామాన్యుడి నడ్డి విరుస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. కరీంనగర్‌కు చెందిన డాక్టర్ రోహిత్ రెడ్డి, గౌతమ్ రెడ్డి దంపతులు తెలంగాణ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.

## 'బాలకృష్ణకు బ్రీత్ ఎనలైజర్‌తో చెక్ చేయించాలి'

బాలకృష్ణను ప్రశ్నించారు వైఎస్సార్‌సీపీ మాజీ ఎంపీ మార్గాని భరత్. అసెంబ్లీలో ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్న బాలకృష్ణ మానసిక స్థితిపై తమకు అనుమానం ఉందన్నారు భరత్. తాడేపల్లి నుంచి మాట్లాడిన భరత్.. ' అసెంబ్లీలో బాలకృష్ణ మాట తీరు.. వ్యవహార శైలి దారుణంగా ఉంది. నెత్తి మీద విగ్గు, దానిమీద గాగుల్స్, జేబులో చేతులు పెట్టుకుని మాట్లాడతారా?, మీ స్థాయి ఏంటో జనసేన వారే తేల్చి చెప్పారు. ఆయన మాట తడపడుతూ మాట్లాడుతున్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే సోషల్ మీడియా కార్యకర్తలపై వేధింపులకు గురి చేస్తున్నారు. ఇప్పటికి 86 మందిని అరెస్టు చేశారు. తారక్ అనే సోషల్ మీడియా కార్యకర్త మీద దోపిడీ దొంగలు, కిడ్నాపర్ల మీద పెట్టే కేసులు పెట్టారు. హైకోర్టు ఎన్నిసార్లు హెచ్చరించినా ప్రభుత్వానికి బుద్ధి రాలేదురాజమండ్రికి చెందిన పులి సాగర్ అనే ఎస్సీ యువకుడిని అర్ధనగ్నంగా లాకప్‌లో పెట్టి వేధించారు. ఎస్సీ కమిషన్ సీరియస్ అయి నోటీసులు కూడా ఇచ్చింది. సీసీ కెమెరా పుటేజీ అడిగితే కెమెరాలు పని చేయటం లేదని అధికారులు అబద్దాలు చెప్పారు. పోలీసులను టీడీపీ నేతల కోసం వాడుతున్నారు. బ్లేడ్ బ్యాచ్ ఏకంగా పోలీసులపై దాడి చేశారు' అని పేర్కొన్నారు. అసెంబ్లీ వేదికగా జగన్‌పై బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలపై వైఎస్సార్‌సీపీ నేతలు అంబటి రాంబాబు, గుడివాడ అమర్నాథ్‌లు మండిపడ్డారు. నెత్తిన విగ్గు, చేతిలో పెగ్గు పెట్టుకుంటే సరిపోదని, ఒంటికి కొంచెం సిగ్గు అనేది ఉండాలని విమర్శించారు గుడివాడ అమర్నాథ్ ప్రపంచంలోనే బాలకృష్ణ అతిపెద్ద సైకో అని, కావాలంటే సర్టిఫికెట్ ప్రొడ్యూస్ చేస్తానన్నారు అంబటి రాంబాబు.

సాగుతామని పన్నులను క్రమంగా తగ్గిస్తామని చెప్పారు. ఇవాళ యూపీ గౌతమ్ బుద్ధ నగర్ లో ఇంటర్నేషనల్ ట్రేడ్ షో-2025 ను ప్రారంభించిన మోదీ ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 2014కు ముందు తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు కాంగ్రెస్ దాని మిత్ర పక్షాలు దేశ ప్రజలకు అబద్ధాలు చెబుతూ వచ్చాయని ధ్వజమెత్తారు. మేము అధికారంలోకి వచ్చాక దేశ ప్రజల ఆదాయాలను పెంచామన్నారు. నెక్స్ట్ జనరేషన్ జీఎస్టీ సంస్కరణలు దేశ ఆర్థిక వృద్ధికి కొత్త ఊతం ఇస్తుందని, ఈ మార్పుల ద్వారా జీఎస్టీ రిజిస్ట్రేషన్ మరింత సులభతరం అవుతుందని, పన్ను వివాదాలు తగ్గుతాయని, ఎంఎస్ఎంఈలకు వేగంగా రిఫండ్లు అందుతాయన్నారు.చిప్ నుంచి షిప్ వరకు అన్నీ భారత్‌లోనే ఉత్పత్తి చేయాలని తమ ప్రభుత్వం భావిస్తున్నదని ప్రధాని చెప్పారు. భారతంలో తయారు అయ్యే మొత్తం మొబైల్ ఫోన్లలో 55 శాతం యూపీలో తయారవుతున్నాయని. సెమీకండక్టర్ రంగంలో యూపీ భారత్ యొక్క స్వావలంబనను మరింత బలోపేతం చేస్తుందని చెప్పారు. ఇతర దేశాలపై భారత్ ఆధారపడటాన్ని తగ్గిస్తున్నామని వెల్లడించారు. డిఫెన్స్ రంగాన్ని మరింత అభివృద్ధి చేస్తున్నారమని రష్యా సహాయంతో ఏర్పాటైన ఫ్యాక్టరీలో త్వరలోనే ఏకే-203 రైఫిళ్ల తయారీని ప్రారంభిస్తామన్నారు. యూపీలో ఒక రక్షణ కారిడార్ నిర్మితమవుతున్నదని తెలిపారు. కాలపరీక్షలతో మన బంధం మరింత బలోపేతం అవుతోందని రష్యాపై మోదీ ఈ సందర్భంగా ప్రశంసలు కురిపించారు. ఈ ట్రేడ్‌షోకు రష్యా భాగస్వామ్య దేశంగా ఉన్న నేపథ్యంలో ప్రధాని మోదీ రష్యా అంశాన్ని ప్రస్తావించారు.జీఎస్టీ రేట్ల తగ్గింపు అంశంపై కాంగ్రెస్‌తో పాటు ప్రతిపక్ష పార్టీలు ప్రజలను తప్పుదారి పట్టించాయని ప్రధాని నరేంద్ర మోదీ విమర్శించారు. టూత్‌పేస్ట్ నుంచి ట్రాక్టర్ల వరకు ప్రతి వస్తువు ధరలపై పన్నుభారం తగ్గిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వాల హయాంలో పన్ను దోపిడీ జరిగిందన్న ఆయన.. భారీ పన్నులతో ప్రజలపై భారం మోపారని మండిపడ్డారు. ఉత్తరప్రదేశ్ అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శన (%ఖు%యూ%)ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడురోజుల కిందట జీఎస్టీ సంస్కరణలు అమలులోకి వచ్చాయని, ఇది నిర్మాణాత్మక మార్పుగా పేర్కొన్నారు. ఇవి భారతదేశ వృద్ధి కథకు కొత్త ఉత్సాహాన్ని ఇస్తాయని తెలిపారు. ఈ సంస్కరణలు జీఎస్టీ నమోదును సులభతరం చేస్తాయని.. పన్ను వివాదాలను తగ్గిస్తాయన్నారు. ఎంఎస్ఎంఈలకు రిటర్న్‌ను వేగవంతం చేస్తాయని.. ప్రతి రంగానికి ప్రయోజనం చేకూరుస్తాయన్నారు. కొన్ని రాజకీయ పార్టీలు దేశ ప్రజలను తప్పుదారి పట్టించడానికి ప్రయత్నిస్తాయన్నారు.2014కి ముందు అధికారంలో ఉన్న కాంగ్రెస్, మిత్రపక్షాలు తమ ప్రభుత్వ వైఫల్యాలను దాచడానికి ప్రజలకు అబద్ధాలు చెబుతున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో పన్నుల ద్వారా భారీ దోపిడీ జరిగిందని.. దోచుకున్న డబ్బును మరింత దోచుకున్నారని.. దేశంలోని సామాన్య పౌరుడు పన్ను భారంతో ఇబ్బందిపడ్డాడని ప్రధాని పేర్కొన్నారు. తన ప్రభుత్వం పన్నులను గణనీయంగా తగ్గించిందని, ద్రవ్యోల్బణాన్ని అరికట్టిందని, ప్రజల ఆదాయంతో పాటు పొదుపును పెంచిందన్నారు. రూ.12లక్షల వరకు ఆదాయాన్ని పన్ను నుంచి మినహాయించడం ద్వారా కొత్త జీఎస్టీ సంస్కరణలను అమలు చేయడం ద్వారా పౌరులు ఈ ఏడాది రూ.2.5లక్షల కోట్లు ఆదా చేస్తారన్నారు.

## నా దృష్టికి తీసుకురండి

151 నుంచి 11 సీట్లకు జగన్ మోహన్ రెడ్డి పడిపోయారని అన్నారు. సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి లోకేష్‌తోపాటు పలువురుపై పోలీసులను ప్రయోగించారని గుర్తుచేశారు. చాలా మందికి తాము ఎందుకు జైలుకు వెళుతున్నామో కూడా తెలియని పరిస్థితి అప్పట్లో ఉండేదన్నారు. శాంతిభద్రతలను కాపాడడానికి ఎంతో ప్రయత్నించామని... ఈ ఏడాది రాష్ట్రంలో 16 శాతం నేరాలు తగ్గాయని వెల్లడించారు. బలహీన వర్గాలు, మహిళలపై నేరాల సంఖ్య రాష్ట్రంలో తగ్గిందని సభకు తెలియజేశారు.గతంలో విపరీతంగా గంజాయి పెరిగిపోయిందని.. అప్పట్లో గంజాయి ఎక్కడ దొరికినా దాని మూలాలు ఏపీలోనే ఉండేవని.. చివరకు స్కూళు బ్యాగుల్లోకీ గంజాయి చేరిపోయిందన్నారు. గత ఐదేళ్ల ప్రభుత్వంలో నిఘా విఫలం అయ్యిందని చెప్పడానికి కారణం గంజాయి విపరీతంగా పెరిగిపోవడమే అని వెల్లడించారు. లిక్కర్ రేటు పెరిగిపోవడంతో గంజాయిని చాలా మంది మత్తు కోసం ఆశ్రయించారని హోంమంత్రి తెలిపారు. సెబ్‌ను రద్దు చేసి ఈగల్ అనే వ్యవస్థను ఏర్పాటు చేసి ఐపీఎస్ అధికారితో పర్యవేక్షణ చేస్తున్నామని చెప్పారు. ఈరోజు గాంజా కల్టివేషన్ రాష్ట్రంలో జీరోకి చేరిందని పేర్కొన్నారు.జనవరి 1 నుంచి ఈరోజు వరకు 32 వేల కేజీల గాంజాను సీజ్ చేశామని సభలో వెల్లడించారు. మెడికల్ షాపులలో డ్రగ్స్‌కు సంబంధించినవి దొరుకుతున్నాయని సభ్యులు తమ దృష్టికి తెచ్చారని.. దీనికి వ్యతిరేకంగా ఆపరేషన్ గరుడా, ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ అని నడిపామని తెలిపారు. 40 వేల బడ్డీలపై రైడ్ చేశామని... ఆపరేషన్ చైతన్య, సంకల్పలను పాఠశాలల్లో నిర్వహిస్తున్నామన్నారు. గత ఐదేళ్లు మహిళల క్యారెక్టర్‌ను దిగజార్చి మాట్లాడారని మండిపడ్డారు. ఉమెన్, ఛైల్డ్ సేఫ్టీకి ఒక మహిళా ఐపీఎస్‌ను పెట్టి శక్తి యాప్‌ను ఏర్పాటు చేశామని అన్నారు. ఒక అమ్మాయి.. ఇబ్బందుల వల్ల రైలు పట్టాలవైపు వెళుతుంటే అది చూసిన వారు శక్తి బృందానికి సమాచారం ఇచ్చారని.. ఆ బృందం వెళ్లి ఆ అమ్మాయిని రక్షిస్తే ఆమె ఇప్పుడు డీఎస్సీ రాసి ఉద్యోగం సాధించారని హోంమంత్రి అనిత తెలియజేశారు.

జగన్ ఓ ఆర్గనైజ్డ్ క్రిమినల్..

ఫోరెన్సిక్ కేసులు 25వేలు పెండింగ్‌లో ఉంటే కూటమి వచ్చాక వాటిని 1600కి తగ్గించగలిగామని తెలిపారు. ఇప్పుడు కన్విక్షన్ రేటు కూడా పెరిగిందన్నారు. సోషల్ మీడియా ఎంత మంచికి ఉపయోగించినా ఇప్పుడు చెడుకూ ఉపయోగిస్తున్నారని అన్నారు. జగన్ ఓ ఆర్గనైజ్డ్ క్రిమినల్ అని సాక్షాత్తూ చంద్రబాబు చెప్పారన్నారు. సోషల్ మీడియాలో కావాలని ఫేక్ పేర్లతో కులాలు మార్చుకొని మరీ పోస్టులు పెడుతున్నారని మండిపడ్డారు. రాజకీయాల్లోకి వచ్చిన పాపానికి మన పిల్లలు కూడా మాట పడాల్సి వస్తోందని ఫైర్ అయ్యారు. డిప్యూటీ సీఎం పిల్లల గురించి కూడా ఇష్టానుసారంగా పోస్టులు పెట్టారని ఆగ్రహించారు.

## 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ' అని ప్రజలకు అర్థమైంది

రైతుకు అండదండగా ఉంటుందనుకుంటాం. లా అండ్ ఆర్డర్ బ్రహ్మాండంగా ఎలాంటి వివక్ష లేకుండా ఉండాలని, అలాంటి పరిస్థితి ప్రభుత్వంలో ఉంటుందని ఎవరైనా ఆశిస్తారు. ఓట్లు వేసినప్పుడు ఎవరైనా ఇవన్నీ కోరుకుంటారు. కానీ ఇప్పుడు విద్య, వైద్యం, వ్యవసాయం, లా అండ్ ఆర్డర్.. ఇలా ఏది తీసుకున్నా, కనపించేది తిరోగమనమే. అధికారంలోకి వచ్చిన 16 నెలల్లోనే చంద్రబాబు ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత కనిపిస్తోందని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. చంద్రబాబు ష్యూరిటీ%-%మోసం గ్యారంటీ అని ప్రజలకు అర్థమైందన్నారు. సంపద సృష్టించి, సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీలు అమలు చేస్తానని ఎన్నికల్లో చెప్పిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చాక స్కామ్‌లు చేస్తూ, ఉన్న సంపదను ఆవిరిచేస్తూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకాలను సైతం రద్దు చేశారని మండిపడ్డారు. సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీలు అమలు చేయకపోయినా, అమలు చేసినట్లు గోబెల్స్ ప్రచారం చేస్తూ విజయోత్సవాలు జరిపిస్తున్నారని దెప్పిపొడిచారు. ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత పెల్లుబుకుతున్న నేపథ్యంలో చంద్రబాబు ప్రజల్లోకి వెళ్లే పరిస్థితి లేదని, పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని దుయ్య బట్టారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో బుధవారం తన అధ్యక్షతన జరిగిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో రీజినల్ కో%-%ఆర్డినేటర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు, పీఏసీ మెంబర్లు, జిల్లా పార్టీ అధ్యక్షులు, పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకులు, పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తలు, రాష్ట్ర కార్యదర్శులు (కో%-%ఆర్డినేషన్), రాష్ట్ర కార్యదర్శుల (పార్లమెంటు) ను ఉద్దేశించి వైఎస్ జగన్ మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలు, సమకాలీన రాజకీయ అంశాలపై చర్చించి.. భవిష్యత్ కార్యాచరణపై వారికి దిశా నిర్దేశం చేశారు. సజావుగా ఎన్నికలు జరిగితే డిపాజిట్లు కూడా దక్కవని చంద్రబాబుకు తెలుసని.. అందుకే సజావుగా ఎన్నికలు జరపడని.. కాబట్టి మీరందరూ ఇంకా గట్టిగా నిలబడి, పోరాడాల్సిన అవసరం ఉందని పార్టీ నేతలకు మార్గ నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..ఇప్పటికే ఈ ప్రభుత్వం మీద ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత కనిపిస్తోంది. ఇది ప్రతి ఇంట్లోనూ, ప్రతి గ్రామంలోనూ కనిపిస్తోంది. సంపద సృష్టిస్తానని చెప్పి అధికారంలోకి వచ్చి, ఉన్న సంపదను ఆవిరి చేస్తున్నారు. ఇప్పుడు రాష్ట్రంలో ఎవరిని కదిలించినా 'ఈ ప్రభుత్వం మాకొద్దు బాబోయ్' అంటున్నారు. ఇది నిజంగా వాస్తవం. ఈమధ్య ఈ పెద్ద మనిషి సూపర్ సిక్స్ సూపర్ హిట్ అంటూ అనంతపురంలో విజయోత్సవ సభ పెట్టబోతున్నప్పుడు వాళ్ల పాంప్లెట్ పేపర్‌లో ఒక అడ్వర్టైజ్‌మెంట్ ఇచ్చాడు. ఎన్నికలప్పుడు ఇచ్చిన అడ్వర్టైజ్‌మెంట్‌కు, ఈ అడ్వర్టైజ్‌మెంట్‌కు మధ్య స్పష్టమైన తేడా ఉంది. కొన్ని పథకాలను ఎగ్గొట్టేశారు. ఇప్పుడు సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ అంశాలు మారిపోయాయి.సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ అమలు చేసేశామంటూ అడ్వర్టైజ్‌మెంట్స్‌లోని అంశాలను మార్చేసి అన్నీ చేసేశాం అంటూ గోబెల్స్ ప్రచారం చేస్తున్నారు.

# బిట్రగుంటలో మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్క్ ఏర్పాటు చేయాలి

**– అసెంబ్లీలో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి**

**కావలి: గాయత్రి వార్తలు కిషోర్ రిపోర్టర్ దాసరి**

కావలి నియోజకవర్గం లోని బిట్రగుంటలో మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్క్ ఏర్పాటు చేస్తే రవాణా సౌకర్యాలు మెరుగవడంతో పాటు విపరీతమైన ఉపాధి అవకాశాలు సృష్టించబడతాయని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి శుక్రవారం అసెంబ్లీలో పేర్కొన్నారు. లాజిస్టిక్స్ రంగంపై మాట్లాడే అవకాశం కల్పించినందుకు సభాపతికి కృతజ్ఞతలు తెలుపుతూ ఆయన మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా రోడ్డు, రైలు, వాయు, సముద్ర మార్గాల అనుసంధానంతో లాజిస్టిక్ హబ్‌లకు ప్రాధాన్యం పెరుగుతోందన్నారు. మన రాష్ట్రం వనరులకు కొదవలేని స్థితిలో ఉందన్నారు. విజనరీ నాయకుడు నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం ముందుకు సాగుతుందన్నారు. ఇలాంటి సమయంలో మా కావలి నియోజకవర్గంలోని బిట్రగుంటలో లాజిస్టిక్ పార్క్ ఏర్పాటు అత్యవసరం అని చెప్పారు. కృష్ణపట్నం పోర్టు ఇప్పటికే రాష్ట్రానికి గుర్తింపు తెచ్చుకుందని, త్వరలో రామాయపట్నం పోర్టు కూడా ప్రారంభమవుతోందని గుర్తుచేశారు. దామవరం సమీపంలో ఎయిర్‌పోర్ట్, జువ్వలదిన్నెలో ఫిషింగ్ హార్బర్ ఏర్పడుతున్నాయని వివరించారు. బిట్రగుంటలో 925 ఎకరాల రైల్వే భూమి ప్రస్తుతం ఖాళీగా ఉందని, అక్కడ మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్క్ ఏర్పాటు చేస్తే కంటైనర్ డిపోలు, గోదాములు, ప్యాకింగ్ సెంటర్లు, బ్రేకింగ్ యార్డులు అభివృద్ధి చేయవచ్చని ఎమ్మెల్యే తెలిపారు. రామాయపట్నం పోర్టు కేవలం 28 కి.మీ., కృష్ణపట్నం పోర్టు 53 కి.మీ. దూరంలో ఉండటాన్ని ఆయన గుర్తు చేశారు. నేషనల్ హైవే కేవలం అర కిలోమీటరులోనే ఉండటంతో రవాణా సౌకర్యాలు విస్తరించనున్నాయని చెప్పారు. లాజిస్టిక్ పార్క్ ద్వారా రవాణా ఖర్చులు




తగ్గడంతో పాటు సరుకులు చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాలకు త్వరగా చేరతాయని అన్నారు. జీడీపీ ఖర్చులను తగ్గించుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. చెన్నై, బెంగళూరు, సింగపూర్‌లలో లాజిస్టిక్ హబ్‌ల వల్ల వేలాది ఉద్యోగాలు సృష్టించబడ్డాయని, అలాంటి అవకాశాలు నెల్లూరు జిల్లాలో కూడా కలుగుతాయని ఉదాహరణగా చెప్పారు. కావలి, కందుకూరు, ఉదయగిరి నియోజకవర్గాలతో పాటు మొత్తం నెల్లూరు మెట్ట ప్రాంత ప్రజలకు ఉపయోగపడేలా బిట్రగుంటలో మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్క్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

# మామూళ్ల మత్తులో జోగుతున్న సేల్ టాక్స్ అధికారులు .

**– నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారస్తులు**

**కావలి: గాయత్రి వార్తలు కిషోర్ రిపోర్టర్ దాసరి**




కావలి పట్టణంలో గత కొన్ని సంవత్సరాలుగా పైపులు వ్యాపారస్తులు తమ వ్యాపారాలు అక్రమంగా కొనసాగించుకుంటున్నారు. వారి లైసెన్సులు తల్లిదండ్రుల పేరు మీద ఉన్నప్పటికీ వారి మరణాంతరం ఆ లైసెన్స్ మీదే వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. కమర్షియల్ ట్యాక్స్ అధికారులకు తెలిసినప్పటికి కూడా వారు అవి ఏమి పట్టించుకోకుండా ప్రభుత్వ ఆదాయానికి లక్షల్లో గండి కొడుతూ... మామూళ్ల మత్తులో జోగుతున్నారని కావలి పట్టణంలో ప్రచారంలో ఉంది. ఎన్నిసార్లు దీనిపై నియంత్రణ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పత్రికల్లోనూ ,సోషల్ మీడియాలో ప్రచురించినప్పటికీ కూడా అధికారులు మౌనం వహిస్తున్నట్లు సమాచారం. ఈ మౌనం వెనుక ఆంతర్యం ఏమిటి.. అనేది ప్రశ్నార్థకంగా మారింది.... సంవత్సరాల తరబడి ఆ లైసెన్సులతోనే వ్యాపారం చేస్తూ లక్షల్లో ఆదాయాన్ని గడిస్తూ ప్రభుత్వానికి చెల్లించవలసిన టాక్సు చెల్లించడం లేదని తోటి వ్యాపారస్తులు ప్రజలు చర్చించుకోవడం విశేషం. ఏది ఏమైనప్పటికీ అధికారులు బాధ్యతరాహిత్యంగా ఉండడం వల్ల వారు మామూళ్ల మత్తులో జోగుతున్నట్లు.... వాటి వలనే వల్లనే వ్యాపారస్తులు విచ్చలవిడిగా తమ చీకటి వ్యాపార కార్యకలాపాలు విస్తరించుకుంటూ... లక్షల్లో వ్యాపారాలు జరిగించుకుంటున్నారు. ఏది ఏమైనప్పటికీ ఏసీబీ అధికారులు కాస్త వ్యాపారస్తులపై, అధికారులపై సమగ్ర విచారణ జరిగితే ఎవరు.... ఏమిటి... ఎక్కడ ఎంత నగదు చేతులు మారుతున్నాయి...? అని విషయాలు బయటకు వచ్చే అవకాశం ఉందని, తోటి వ్యాపారస్తులు ప్రజలు తమ మనసులో భావాన్ని వ్యక్తపరుస్తున్నారు.

# నందమూరి బాలకృష్ణని విమర్శిస్తే ఊరుకోం ఎం.సుబ్బయ్య

**శ్రీకాళహస్తి, గాయత్రి వార్తలు:**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిరిజన సలహా మండలి సభ్యులు ఎం. సుబ్బయ్య మాట్లాడుతూ హిందూపురం శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ గారు ఇటీవల జరిగిన శాసనమండలి సమావేశంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని "సైకో" అని సంబోధించడంతో, నిన్నటి నుండి వైసీపీ నాయకులు మల్లీశ్వరి, రోజా, జూపూడి, పేర్ని నాని, అంబటి రాంబాబు, కొడాలి నాని, అనిల్ కుమార్ యాదవ్ తదితరులు బాలకృష్ణ గారిపై తీవ్ర విమర్శలు చేస్తున్నారని అన్నారు. అయితే 2019 నుండి 2024 వరకు నందమూరి భువనేశ్వరి గారిని, చంద్రబాబు నాయుడు గారిని, లోకేష్ బాబును నిండు సభలో అవమానపరిచినప్పుడు బాలకృష్ణ గారు ఎప్పుడూ ఎవరి మీదా విమర్శలు చేయలేదని గుర్తు చేశారు. ఆ సందర్భంలో కొడాలి నాని, రోజా, పేర్ని నాని తదితరులు తీవ్రమైన వ్యాఖ్యలు చేసిన విషయాన్ని సుబ్బయ్య ప్రస్తావించారు. ఇప్పుడేమో బాలకృష్ణ గారు జగన్‌ను "సైకో" అన్నారని మాత్రమే వైసీపీ నాయకులు ఒక్కసారిగా ఆగ్రహం వ్యక్తం చేయడం అన్యాయమని ఆయన పేర్కొన్నారు. "నందమూరి అభిమానులమంతా బాలయ్య గారికి అండగా ఉంటాం. ఇకపై ఆయనను 'పిచ్చోడు', 'మెంటల్' అంటూ వైసీపీ నాయకులు సంబోధిస్తే మేము అస్సలు ఊరుకోం" అని ఎం. సుబ్బయ్య హెచ్చరించారు.



## శ్రీకాళహస్తిలో మహాలక్ష్మి రూపంలో దర్శనమిచ్చిన దుర్గమ్మ తల్లి

**– భక్తి భావాలతో పరవశించిన భక్తులు**

**శ్రీకాళహస్తి, గాయత్రి వార్తలు: (రిపోర్టర్ మద్దిమడుగు మునిరత్నం)**




శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానానికి అనుబంధ ఆలయంగా ఉన్న కనకాచలంపై వెలసి ఉన్న శ్రీ దుర్గా దేవి దసరా నవరాత్రులలో భాగంగా, అంగరంగ వైభవంగా పూజలు జరుగుతున్నాయి. ఈ నవరాత్రులలో ఐదవ రోజు అయిన శుక్రవారం అమ్మవారు మహాలక్ష్మి దేవి అలంకరణలో భక్తులకు కన్నుల పండుగగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు తులసి శర్మ, చెంగల్రాయులు మాట్లాడుతూ "ఈరోజు ఉదయం నాలుగు గంటల నుంచే భక్తులు పెద్ద ఎత్తున హాజరై, భక్తిశ్రద్ధలతో నిమ్మకాయలతో దీపాలు వెలిగిస్తూ, తమ కోరికలు మొక్కుకుంటూ అమ్మవారి దర్శన భాగ్యం పొందుతున్నారు" అని తెలిపారు.

## ఊరందూరులో సురేష్ రెడ్డి ఇంటికి వెళ్లిన బియ్యపు మధుసూదన్ రెడ్డి

**శ్రీకాళహస్తి,గాయత్రి వార్తలు:**



శ్రీకాళహస్తి నియోజకవర్గం, ఊరందూరు గ్రామానికి చెందిన వైఎస్ఆర్సిపి నాయకులు సురేష్ రెడ్డి కుమారుడి కేశఖండన కార్యక్రమంలో శ్రీకాళహస్తి మాజీ శాసనసభ్యులు పైన బియ్యపు మధుసూదన్ రెడ్డి పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి మండల అధ్యక్షుడు చెవిరెడ్డి మధుసూదన్ రెడ్డి,సుమన్ రెడ్డి,విజయ భాస్కర్ రెడ్డి,దిలీప్, పవన్, మునికృష్ణ, నవీన్,శివ, అరుణాచలం, నరేంద్ర, దాసు, మనోజ్, చెంచుకృష్ణ, భాను, లోకేష్, సంజీవయ్య, రామ్ చరణ్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## బోగోలు మండలం పాత బిట్రగుంట కు చెందిన ఉప్పాల మోహన్



**కావలి : గాయత్రి వార్తలు కిషోర్ రిపోర్టర్ దాసరి**

ఇటీవల కాలంలో అనారోగ్యం తో హాస్పిటల్ లో చికిత్స పొంది డిశ్చార్జ్ అయి ఇంటికి వచ్చిన సందర్భంగా కావలి మాజీ శాసనసభ్యులు శ్రీ రామిరెడ్డి ప్రతాప్ రెడ్డి మరియు వైసీపీ నాయకులు పాతబిట్రగుంట గ్రామంలో వారి ఇంటికి వెళ్లి పరామర్శించడం జరిగింది.

## దుర్గమ్మ తల్లిని దర్శించుకున్న బియ్యపు మధుసూదన్ రెడ్డి

**శ్రీకాళహస్తి,గాయత్రి వార్తలు: (రిపోర్టర్ మద్దిమడుగు మునిరత్నం)**



దేవీ నవరాత్రులు శుభ సందర్భంగా శ్రీకాళహస్తి పట్టణం కనకాచలం కొండపై వెలసిన శ్రీ కనకదుర్గమ్మ తల్లి అభిషేక సేవలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి, దేవస్థానం మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్నా రాయల్, జై శ్యామ్ రాయల్, శ్రీవారి సురేష్, మోగరాల గణేష్, కాణిపాకం సురేష్, యశ్వంత్ రెడ్డి, కుమార్, మనీ, రవి,సతీష్,సూర్య,బాబి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర నాయకులు భాస్కర్ యాదవ్ కి ఘన సన్మానం చేసిన షేక్ కరీముల్లా

**శ్రీకాళహస్తి,గాయత్రి వార్తలు: (రిపోర్టర్ మద్దిమడుగు మునిరత్నం)**




శ్రీకాళహస్తి పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం రాష్ట్ర ఓబిసి సెక్రటరీ భాస్కర్ యాదవ్‌కు మైనార్టీ సెల్ జిల్లా జనరల్ సెక్రటరీ షేక్ కరీముల్లా ఆధ్వర్యంలో ఘన సన్మానం జరిగింది. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు ఎస్. చిరంజీవి, అర్జున గురుమూర్తి, నిత్యానందం తదితరులు పాల్గొన్నారు. ఆల్ ఇండియా కాంగ్రెస్ పిలుపు మేరకు పట్టణంలో "ఓట్ చర్" కార్యక్రమం నిర్వహించి, ఈవీఎంలకు వ్యతిరేకంగా బ్యాలెట్ పత్రాలు కావాలంటూ సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు బంగారి రమేష్ రాయల్‌ను పట్టణ అధ్యక్షుడిగా నియమించి సన్మానించారు.

## భారీ వర్షాలకు తెలంగాణ చతిస్గడ్ సరిహద్దు గ్రామాలలో నిలిచిపోయిన రాకపోకలు

గాయత్రి వార్తలు: ములుగు జిల్లాలోని వాజేడు మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మండల కేంద్రంలోని చాలా గ్రామాలు జలమయమయ్యాయి ఉద్రిక్తంగా కొనసాగడంతో వాజేడు మండలంలోని టేకులగూడెం వద్ద జాతీయ రహదారి 163 పై వరదనీరు భారీగా చేరడంతో గురువారం అర్ధరాత్రి నుండి తెలంగాణ చతిస్గడ్ సరిహద్దు గ్రామాలలో నిలిచిపోయిన రాకపోకలు దీంతో గ్రామాల్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు

# ‘ఓజీ’.. రికార్డు స్థాయిలో ఫస్ట్ డే కలెక్షన్స్.. ఎంతంటే?



సినీ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూసిన ‘ఓజీ’ విడుదలైంది. ఫ్యాన్స్ ఆశించినట్టే హిట్ టాక్ సొంతం చేసుకుంది. ఫస్ట్ డే కలెక్షన్స్ ఎంత వసూలు చేసిందన్న ప్రశ్నకు చిత్ర బృందం తాజాగా సమాధానమిచ్చింది. ప్రపంచవ్యాప్తంగా తొలి రోజు రూ.154కోట్లకుపైగా వసూలు చేసిందని నిర్మాణ సంస్థ డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. ఈ మేరకు పవర్‌ఫుల్ పోస్టర్ పంచుకుంటూ ‘ఇది పవన్ కల్యాణ్ సినిమా. చరిత్రను ఓజీ చెరిపేసింది’ అని క్యాప్షన్ పెట్టింది.ప్రీమియర్స్‌లోనూ అత్యధిక వసూళ్లు (గ్రాస్) రాబట్టిన సినిమాగా ‘ఓజీ’ నిలిచింది. అడ్వాన్స్ బుకింగ్స్ ఓపెన్ కావడమే ఆలస్యం టికెట్లు అత్యంత వేగంగా అమ్ముడుపోయాయి. తొలిరోజు ఈ స్థాయి కలెక్షన్లు పవన్ కల్యాణ్ కెరీర్‌లోనే ఓ రికార్డు. ఫస్ట్ డే అత్యధిక వసూలు చేసిన టాప్-10 భారతీయ సినిమాల జాబితాలో ‘ఓజీ’ చోటు దక్కించుకుంది. ఆయా చిత్ర బృందాలు అధికారికంగా ప్రకటించిన తొలి రోజు కలెక్షన్స్ మేరకు.. టాలీవుడ్ నుంచి ఏడో చిత్రమిది.

తాను ఆరాధించే హీరోతో ఓ అభిమాని సినిమా తీస్తే ఎలా ఉంటుందో ‘ఓజీ’ మరోసారి రుజువు చేసింది. తనలాంటి ఎంతోమంది ఫ్యాన్స్ కొంతకాలంగా పవన్ సినిమాల్లో ఏం మిస్ అవుతున్నారో దాన్ని భర్తీ చేశారు దర్శకుడు సుజీత్. ఆయన స్టైలిష్ మేకింగ్, పవన్ లుక్స్, మ్యానరిజం, యాక్షన్, తమన్ నేపథ్యం హైలైట్. యూనివర్స్ క్రియేట్ చేసే ఆలోచన ఉందని దర్శకుడు ఇప్పటికే వెల్లడించారు. అందులో ప్రభాస్ నటిస్తారా? అన్న దానిపై ఇప్పుడేం ఏం చెప్పలేనన్నారు.



# అల్లు అర్జున్ సలహాతోనే అలా తీర్చిదిద్దుకున్నా!



తమన్నా అందం.. అభినయాలకే కాదు.. ఆమె చేసే హుషారైన నృత్యాలకు సినీ ప్రియుల్లో ప్రత్యేకమైన క్రేజ్ ఉంది. అందుకే గత కొన్నేళ్లుగా ప్రత్యేక గీతాలకు పెట్టింది పేరుగా అన్ని చిత్రసీమల్లోనూ జోరు చూపిస్తోంది. అయితే డ్యాన్స్ విషయంలో తనని తాను ఉత్తమ నృత్యకారిణిగా తీర్చిదిద్దుకోవడంలో అల్లు అర్జున్ ఇచ్చిన సలహాలే ఎంతో ఉపయోగపడ్డాయని తెలిపింది ఈ మిల్కీ బ్యూటీ. దీని వెనకున్న ఓ ఆసక్తికర విషయాన్ని తాజాగా ఓ ఇంటర్వ్యూలో పంచుకుంది. “అప్పట్లో నేను తెలుగు, తమిళ భాషల్లో అన్ని రకాల వాణిజ్య చిత్రాలు చేసేదాన్ని. ప్రతి సినిమాలోనూ కనీసం నాలుగైదు పాటల్లో చేస్తుండేదాన్ని. అయితే ‘బద్రీనాథ్’ చేస్తున్నప్పుడు అల్లు అర్జున్ నన్ను అత్యంత క్లిష్టమైన స్టెప్పుల్ని ప్రయత్నించమని పురిగొల్పారు. నేను తనతో పాటు ఫ్లోర్ మూమెంట్స్ చేయాలని పట్టుబట్టారు. నేను నిజంగా బాగా డ్యాన్స్ చేస్తానని, దానికి తగ్గట్లు అంతే కఠినమైన స్టెప్స్ కొరియోగ్రఫీ చేయాలని దర్శకుడితోనూ చెప్పారు. అలా దాని కోసం నేనెంతో కష్టపడి క్లిష్టమైన నృత్య దశల్ని ప్రయత్నించా. ఆ సినిమా విడుదలయ్యాక నాకు చాలా అవకాశాలొచ్చాయి. ముఖ్యంగా డ్యాన్స్ నంబర్లకు ప్రసిద్ధి చెందా” అని తమన్నా ఆనాటి జ్ఞాపకాల్ని గుర్తు చేసుకుంది. అల్లు అర్జున్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపింది. ప్రస్తుతం ఆయన పాన్ ఇండియా సూపర్‌స్టార్‌గా ఎదగడం పట్ల తన ఆనందాన్ని వ్యక్తం చేసింది. ప్రస్తుతం ఆమె హిందీలో ‘రోమియో’, ‘రేంజర్’ తదితర చిత్రాల్లో నటిస్తోంది.

# ప్రతి మాస్క్ వెనుక ఓ సత్యం

‘ది గేమ్: యు నెవర్ ప్లే అలోన్’ సిరీస్‌తో తొలిసారి ఓటీటీ వేదికగా ప్రేక్షకుల్ని పలకరించనుంది శ్రద్ధా శ్రీనాథ్. ఆమె ప్రధాన పాత్రలో నటించిన ఈ సిరీస్‌ని రాజేశ్ ఎం సెల్వ తెరకెక్కించారు. సంతోశ్ ప్రతాప్, చాందిని, హేమ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సిరీస్ అక్టోబరు 2నుంచి ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఈ నేపథ్యంలోనే గురువారం ఈ సిరీస్ ట్రైలర్‌ను విడుదల చేశారు. ఓ వర్చువల్ గేమ్ ఆడుతున్నప్పుడు దాని వల్ల నిజ జీవితంలో చోటు చేసుకున్న ఘటనలతో ఈ థ్రిల్లర్ సాగనున్నట్లు ఆ ట్రైలర్‌ను బట్టి అర్థమవుతోంది. ఈ సందర్భంగా శ్రద్ధా శ్రీనాథ్ మాట్లాడుతూ... “ఈ సిరీస్‌లో గేమింగ్ డెవలపర్ పాత్ర పోషించడం థ్రిల్లింగ్‌గా, సవాలుగా అనిపించింది. నా పాత్ర సృష్టించిన ప్రపంచమే తనకు వ్యతిరేకంగా మారి, ప్రాణాలతో తప్పించుకోలేని భయంకర పరిస్థితి సృష్టిస్తే ఏం జరిగిందన్నది ఆసక్తికరంగా ఉంటుంది” అంది. “ట్రైలర్‌లో చెప్పినట్లుగా ప్రతి మాస్క్ వెనుక ఒక సత్యం దాగి ఉంటుంది” అన్నారు దర్శకుడు.

# కరీనా 68.. దాయ్రా

గత ఏడాది ‘క్రూ’, ‘సింగం ఎగైన్’ చిత్రాలతో తెరపై ప్రేక్షకుల్ని అలరించిన బాలీవుడ్ నటి కరీనా కపూర్ తాజాగా తన 68వ సినిమా ‘దాయ్రా’ని అధికారికంగా ప్రకటించింది. ఈ సందర్భంగా ఆమె మొదటి రోజు చిత్రీకరణను ప్రారంభించినట్లు తెలియజేస్తూ ఇన్‌స్టా వేదికగా ఓ వీడియోను పంచుకుంది. “అద్భుతమైన మేఘనా గుల్జార్, పృథ్వీరాజ్ సుకుమారన్‌లతో ‘దాయ్రా’ తొలి రోజు. మీ ప్రేమ, ఆశీస్సులు పంపండి” అనే క్యాప్షన్‌ని జోడించింది. కరీనా, పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ సినిమాకి మేఘనా గుల్జార్ దర్శకత్వం వహిస్తున్నారు. క్రైమ్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రాన్ని జంగ్లీ పిక్చర్స్ నిర్మిస్తోంది. ఇందులో పృథ్వీ పోలీసు పాత్రలో కనిపించనున్నారు.



# ఓం నమఃశివాయ

సుధీర్‌బాబు, సోనాక్షి సిన్హా ప్రధాన పాత్రధారులుగా వెంకట్ కల్యాణ్ - అభిషేక్ జైస్వాల్ తెరకెక్కించిన చిత్రం ‘జటాధర’. దివ్య ఖోస్లా, శిల్పా శిరోద్కర్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా తెలుగు, హిందీ భాషల్లో నవంబరు 7న విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే ప్రచార పర్వంలో భాగంగా ఇందులోని తొలి పాటను ‘సోల్ ఆఫ్ జటాధర’ పేరుతో గురువారం విడుదల చేశారు. “ఓం నమఃశివాయ” అంటూ సాగే ఆ పాటకు రాజీవ్ రాజ్ స్వరాలు సమకూర్చడంతో పాటు స్వయంగా ఆలపించారు. “మంచి - చెడు, వెలుగు - చీకటి, మానవ సంకల్పం - విధికి మధ్య జరిగే అద్భుతమైన పోరాటంగా ఈ సినిమా ఉండనుంది. ఇది ప్రేక్షకులకు గొప్ప సినిమాటిక్ అనుభూతిని అందిస్తుంది” అని చిత్ర వర్గాలు తెలిపాయి.





# ‘కాంతార చాప్టర్ 1’ ఆ సన్నివేశాల సమయంలో నియమాలు పాటించా: రిషబ్‌శెట్టి

‘కాంతార’కు ప్రీక్వెల్‌గా తెరకెక్కుతున్న సినిమా ‘కాంతార 2’ . ‘కాంతార చాప్టర్ 1’ పేరుతో ఇది రానుంది. తాజాగా ఈ సినిమా గురించి రిషబ్ శెట్టి కొన్ని ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. కాంతార క్లైమాక్స్ కంటే ఇది ఇంకా శక్తిమంతంగా ఉంటుందన్నారు.“కాంతార చాప్టర్ 1’లో కొన్ని సన్నివేశాలు ఎప్పటికీ మర్చిపోలేరు. ముఖ్యంగా ఒక సీన్ మీకు జీవితాంతం గుర్తుంటుంది. కచ్చితంగా చిత్ర పరిశ్రమలోని వారికి నన్ను చూసినప్పుడు ఆ సన్నివేశం గుర్తుకువస్తుంది. భాషతో సంబంధం లేకుండా తెలుగు, తమిళ, హిందీ, మలయాళ పరిశ్రమలోని వారు కూడా దాని గురించి మాట్లాడుకుంటారు. దర్శక నిర్మాతలు, సాంకేతిక నిపుణులు అందరూ దీన్ని ప్రేరణగా తీసుకుంటారు. కాంతార చిత్రం తర్వాత నా జీవితం మారిపోయింది. ప్రేక్షకుల నుంచి వచ్చిన ఆదరణను ఎప్పటికీ మర్చిపోలేను. కొత్తగా అనిపించింది. ఈ విజయం నా టీమ్ అందరికీ చెందుతుంది” అని తెలిపారు.

“ఈ సినిమాలో దేవుడికి సంబంధించిన సన్నివేశాలు తీసే సమయంలో నేను నియమాలు పాటించాను. మాంసాహారం తీసుకోలేదు. చెప్పులు వేసుకోలేదు. నేను భగవంతుడిని బాగా నమ్ముతాను. అందుకే ఆ సన్నివేశాలు తెరకెక్కించేటప్పుడు నాకు నేను పరిమితులు విధించుకున్నా. నేను ఇతరుల నమ్మకాల గురించి మాట్లాడను. ఎవరి నమ్మకం వారిది” అని రిషబ్ అన్నారు.

రిషబ్ శెట్టి స్వీయ దర్శకత్వంలో ఇది రానుంది. రుక్మిణీ వసంత్ కథానాయిక. ఈ చిత్రం అక్టోబరు 2న థియేటర్లలోకి రానుంది. తాజాగా విడుదల చేసిన ట్రైలర్ సినిమాపై అంచనాలు పెంచింది. “నాన్న ఇక్కడే ఎందుకు మాయమయ్యాడు” అంటూ ఓ కుర్రాడు వేసే ప్రశ్నతో మొదలైన ట్రైలర్.. అందులో కనిపించిన సరికొత్త ప్రపంచం, ఓ అసాధారణ ప్రేమకథ, ఈశ్వరుడి నేపథ్యం, భారీ యుద్ధాలు.. అన్నీ ఆసక్తి రేకెత్తించేలా ఉన్నాయి. ఆఖర్లో ఈశ్వర అవతారంలో త్రిశూలంతో రిషబ్ కనిపించిన తీరు ఆకర్షణగా నిలిచింది.